సాక్షి నిర్మల్

శనివారం, 26 ఆగస్టు, 2023



'ఆశ్రమ' విద్యార్థినులకు అస్వస్థత

జిల్లా కేంద్రంలోని ఈదుగాం బాలికల ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థినులు శుక్రవారం అస్వస్థత గురయ్యారు. బోధకాలు నివారణ మాత్రలు వేసుకున్న వారిలో 10 మంది అస్వస్థతకు గురయ్యారు. 8లో▸

ఖానాపూర్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఇమ్రాన్‌ఖాన్



ఖానాపూర్: ఖానాపూర్ నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా ఇమ్రాన్‌ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన మహేందర్‌రెడ్డి భైంసాకు బదిలీపై వెళ్లగా ఆదిలాబాద్‌లో ఆడిట్ విభాగంలో పనిచేసిన ఇమ్రాన్‌ఖాన్ ఖానాపూర్‌కు వచ్చారు. ఇద్దరినీ స్థానిక రైటర్లు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.4 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో ఉరుములతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డిగ్రీ కళాశాలలో ఉర్దూ మీడియం సైన్స్ కోర్సులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ఉర్దూ మీడియం సైన్స్ కోర్సులకు అనుమతించింది. ఈ విద్యా సంవత్సరానికి కొత్తగా ఉర్దూ మీడియంలో బీఎస్సీ(లైఫ్ సైన్స్), బీఎస్సీ(ఫిజికల్ సైన్స్) కోర్సులు మంజూరయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు తెలిపారు. ప్రతీ కోర్సులో 60 సీట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఉర్దూ మీడియంలో ఇంటర్ సైన్స్ గ్రూప్ చదివిన విద్యార్థులు దోస్తు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4లోపు రిజిస్ట్రేషన్ చేసుకుని సీటు పొందాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కోటి వృక్షార్చన విజయవంతం చేయాలి

నిర్మల్ రూరల్: జిల్లాలో శనివారం నిర్వహించే కోటి వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 'ఒకరోజు– కోటి మొక్కల ప్లాంటేషన్' కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా మండలాలకు, గ్రామపంచాయతీలకు మొక్కలు చేరవేశామని, సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

సంపద వనాల పరిశీలన



అధికారులతో డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: మండల కేంద్రంలో కడెం ప్రాజెక్ట్ కుడి కాలువకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ దశాబ్ది సంపద వనాలను డీఆర్డీవో విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. సంపద వనం పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రూ.18 లక్షల వ్యయంతో రెండు సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 3,500 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, సర్పంచ్ అనూష, ఏపీవో జయదేవ్, ఉపాధిహామీ సిబ్బంది సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు మద్యం షాపులకు మళ్లీ టెండర్లు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా పరిధిలోని(47) మద్యం షాపులకుగాను ఈనెల 21న నిర్వహించిన మద్యం టెండర్ల ప్రక్రియలో తక్కువగా దరఖాస్తులు వచ్చిన నాలుగు మద్యం షాపులకు రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్ పరిధిలో 3 షాపులు, భైంసా పరిధిలో ఒక షాప్‌కు తక్కువ దరఖాస్తులు వచ్చినందున డ్రా తీయలేదని పేర్కొన్నారు. గెజిట్ నంబర్ 16 షాప్ నంబర్ 2 లక్ష్మణచాంద, గెజిట్ నంబర్ 17 పొన్కల్ మద్యం దుకాణాలు గౌడ కులస్తులకు రిజర్వ్ చేయబడినవని వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా గౌడ కులస్తులు ఈ షాపులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెజిట్ నంబర్15 లక్ష్మణచాంద, గెజిట్ నంబర్ 41 నర్సాపూర్(జి) మద్యం దుకాణాలు జనరల్ కేటగిరీకి కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 28 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 29 ఉదయం 10 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో డ్రా నిర్వహిస్తామని తెలిపారు.

ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి

- ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ

సారంగపూర్: ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాన్ని తెల్లరేషన్‌కార్డు కలిగి వారు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజరు సత్యనారాయణ అన్నారు. ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాక్షి ఆదేశాల మేరకు మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకులంలో శుక్రవారం అవగాహన కల్పించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ పథకంలో 1,657 రకాల జబ్బులకు 5 లక్షల వరకు ఉచిత వైద్యసేవలను అందిస్తుందన్నారు. ఈవిషయాన్ని విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం 83338 15951లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో టీంలీడర్ భూమారెడ్డి, ప్రిన్సిపాల్ రమాకళ్యాణి, ఆరోగ్యమిత్ర రేఖ, ప్రవీణ్, ముఖేశ్ తదితరులు ఉన్నారు.

ప్రత్యర్థులెవరో..!

- ఇప్పటికే 'కారు' అభ్యర్థులు ఖరారు..
- ఇక మిగిలింది కమలం, కాంగ్రెస్సే
- రెండు పార్టీల్లో తీవ్ర పోటీ



నిర్మల్: ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ సై అంటోంది. ఆ పార్టీ నుంచి బరిలో నిలిచేదెవరో ఇప్పటికీ ఖరారైపోయింది. ఇక వారితో తలపడేదెవరో తేలాల్సి ఉంది. గులాబీదళం నుంచి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి(నిర్మల్), గడ్డిగారి విఠల్‌రెడ్డి(ముధోల్), భూక్య జాన్సన్‌నాయక్(ఖానాపూర్) పోటీచేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రధాన ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీలో ఉంటారనేది ఇంకా స్పష్టత లేదు. నిర్మల్‌లో అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లే ఉన్నా.. ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాలు చాలా క్రిటికల్‌గా ఉన్నాయి. రెండు పార్టీల్లో పోటాపోటీగా ఆశావహులు ఉండటంతో ఆ రెండు నియోజకవర్గాలే కీలకంగా మారాయి. కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా, బీజేపీ ఇప్పటికే కొన్ని పేర్లను ఫైనల్ చేసి పరిశీలిస్తోంది. ఈ రెండు పార్టీలూ ఇప్పటి వరకు ఇంకా అభ్యర్థుల పేర్లను మాత్రం బయటపెట్టలేదు. ఈ పార్టీలతోపాటు ఈసారి బీఎస్పీ బలమైన పోటీ ఇచ్చే అభ్యర్థుల కోసం ప్రయత్నిస్తోంది.

నిర్మల్..



మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ



శ్రీహరిరావు, కాంగ్రెస్

రాజకీయ కేంద్రంగా ఉన్న నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ తమ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డినే మరోసారి బరిలో దింపుతోంది. ఇక ఆయనకు మూడు దఫాలుగా ప్ర త్యర్థిగా కొనసాగుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈసారి బీజేపీ నుంచి పోటీచేయడం దాదాపు ఖాయమైంది. ఎమ్మెల్యే అభ్యర్థిగానే ఆయన ఏఐసీసీ పదవి వదులుకుని కమలదళంలో చేరారు. ఈమేరకు ఆయనకు టికెట్ ఖాయమైపోయింది. కాంగ్రెస్ నుంచి కూచాడి శ్రీహరిరావు పేరు కూడా ఖాయమే. ఉద్యమనేతగా, బీఆర్ఎస్‌లో సీనియర్ నాయకుడిగా ఉన్న ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవలే డీసీసీ అధ్యక్షుడు కూడా అయ్యారు. సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంబడి రాజేశ్వర్ మరికొందరు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ మాత్రం కూచాడికే సీటు ఇవ్వడం ఖాయమని తెలుస్తోంది.





కిరణ్‌కుమార్, ఆనంద్‌రావుపటేల్(కాంగ్రెస్)





రమాదేవి, రామారావుపటేల్(బీజేపీ)

ముధోల్..

ముధోల్ నియోజకవర్గంలో కూడా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. కారు పార్టీ అసమ్మతిని పట్టించుకోకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికే మళ్లీ సీటిచ్చింది. ఇక్కడ బీజేపీ నుంచి ముగ్గురు బలమైన అభ్యర్థులతోపాటు ఒక యువ ఎన్ఆర్ఐ టికెట్ ఆశిస్తున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఉన్న రమాదేవి 2014, 2018 ఎన్నికల్లో పోటీచేసి రెండోస్థానంలో నిలిచారు. రామారావుపటేల్ డీసీసీ అధ్యక్ష స్థానాన్ని వీడి బీజేపీలో చేరారు. ని యోజకవర్గంలో మోహన్‌రావుపటేల్ సీనియర్‌నేతగా కొనసాగుతున్నారు. ఇక ఎన్ఆర్ఐ బాజీరావుపటేల్ సైతం పార్టీ దృష్టిలో పడే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. ఇందులో ఎవరికి కమలదళం టికెటిస్తుందో తేలడం లేదు. ఏ ఒక్కరికి ఇచ్చినా మిగితా ముగ్గురు పనిచేస్తారా.. అనే ప్రశ్న కూడా ఉంది. కాంగ్రెస్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ పార్టీకి పెద్ద లీడరంటూ లేరు. పార్టీని వీడకుండా ఉన్న ఆనంద్‌రావుపటేల్ సీనియర్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల పార్టీలో చేరిన వైద్యుడు కిరణ్‌కుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎన్ఆర్ఐగా రాజకీయాల్లోకి వచ్చిన సీనియర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ముధోల్ మాజీ జెడ్పీటీసీ నర్సాగౌడ్ కూడా తమ పేర్లు పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు. కుల సమీకరణలో భాగంగా బోథ్‌కు చెందిన తుల అరుణ్‌కుమార్ పేరూ వినిపించింది.

ఖానాపూర్..



రేఖానాయక్, ఎమ్మెల్యే



వెడ్మ బొజ్జు, కాంగ్రెస్



రమేశ్ రాథోడ్, బీజేపీ



జానకీబాయి, బీజేపీ

ఎస్టీ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో పార్టీ సీట్లకోసం తీవ్రమైన పోటీ ఉంది. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల మూడు జిల్లాల్లో ఉన్న ఈ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ మిత్రుడు జాన్సన్‌నాయక్‌కు టికెట్ కేటాయించింది. తన స్థానాన్ని కోల్పోయిన సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్‌వైపు చూస్తున్నారు. టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే హస్తం పార్టీలో ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఎస్టీ సెల్ రాష్ట్రకార్యదర్శి భరత్‌చౌహాన్, ఏఐసీసీ రీసెర్చ్ కమిటీ కోఆర్డినేటర్ వినోద్‌నాయక్‌తోపాటు కొత్తగా మాజీ జెడ్పీటీసీ భుక్యానాయక్, చంద్రశేఖర్, రాంకిషన్‌నాయక్ సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీలో కూడా ఇదేస్థాయిలో పోటీ ఉంది. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ టికెట్ ఆశిస్తుండగా, పెంబి జెడ్పీటీసీ జానకీబాయి లోకల్ నినాదంతో జనాల్లోకి వెళ్తున్నారు. హరినాయక్‌తోపాటు గత ఎన్నికల్లో పోటీ చేసిన సట్ల అశోక్ సైతం బరిలో నిలిచే ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రతీ ఓటు పక్కా!

- పౌరులందరూ ఓటేసేలా ప్రచారం
- ఓటరుగా నమోదు, వినియోగంపై అవగాహన
- ప్రచార కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా చర్యలు



ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో చూపిస్తున్న అధికారులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్న ఓటర్లు తప్పనిసరిగా ఎన్నికల్లో పాల్గొనేలా జాగృతం చేస్తోంది. ఎన్నికల సంఘం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో పలు ప్రచార కార్యక్రమాల్లో చేపడుతోంది. ఈవీఎంల ప్రదర్శన నిర్వహిస్తోంది. వచ్చే ఎన్నికల దృష్ట్యా అధికారులు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. ఈ నెల 21న సవరించిన ఓటరు ముసాయిదా జాబితా ప్రచురించారు. తుది జాబితా అక్టోబర్‌లో వెలువడనుంది. ఆ జాబితాలో ఉన్న వారికే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని సూచిస్తున్నారు. కొత్త, పాత వాళ్లు తమ ఓటరులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని కోరుతున్నారు. ఇందుకోసం సంబంధిత ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు ఇవ్వాలని సూచిస్తున్నారు.

వందశాతం లక్ష్యంగా..

వంద శాతం పోలింగ్ లక్ష్యంగా అధికారులు ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేస్తేనే ఈ లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. 2018 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో సగటున 82.11 శాతం పోలింగ్ నమోదైంది. మంచిర్యాలలో మినహా అన్ని నియోజకవర్గాల్లో 80 శాతం దాటింది. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ బూత్‌లలో 90శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. కుమురంభీం జిల్లా సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ 71వ బూత్‌లో ఏకంగా 100 శాతం ఓట్లు పోలయ్యాయి. అక్కడున్న ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇలా ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో అందరూ ఓటేస్తే వంద శాతం లక్ష్యం చేరుకోవడం సులువేనని అధికారులు చెబుతున్నారు.

పట్టణాల్లోనే వెనుకబాటు

గ్రామాలతో పోలిస్తే పట్టణాల్లో చాలా మంది ఓటర్లు ఇంకా ఓటుకు దూరంగా ఉంటున్నారు. వలస వెళ్లిన వారు, ఉద్యోగ, ఉపాధిరీత్యా వేరే చోటు నుంచి వచ్చి ఓటు వేయడంలో అలసత్వం చూపుతున్నారు. అలాంటి వారికి తమ ఓటు హ క్కును తామున్న చోటుకే మార్చుకునే అవకాశం ఉంది. కానీ సొంతూరులో ఓటరుగా ఉన్నప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో పాలుపంచుకోవడం లేదు. మరోవైపు ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లోనూ 90శాతం చేరువకు వెళ్లడం మారుమూల ప్రాంతాల్లో ఓటు విలువ చాటి చెబుతోంది.

ఓటేస్తేనే ప్రశ్నించే హక్కు

ఎన్నికల్లో ఓటేస్తేనే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందనే అవగాహన ప్రతీ ఒక్కరిలో పెంపొందించాల్సి ఉంది. తమను పాలించే వారిని ఎన్నుకోవడంలో అల సత్వం చూపొద్దనే భావన ప్రతీ ఒక్కరిలో రా వాల్సి ఉంది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు పౌరులకు ఓటు విలు వపై మరింత విస్తృతంగా ప్రచారం చేపట్టా లని ప్రజాస్వామ్య వాదులు కోరుతున్నారు.

పోలింగ్ శాతం

నియోజకవర్గం	2014	2018	తాజా ముసాయిదా ప్రకారం ఓటర్లు
సిర్పూరు	78.88	85.93	2,17,551
ఆసిఫాబాద్(ఎస్టీ)	77.10	86.00	2,14,104
బోథ్(ఎస్టీ)	79.91	85.29	2,05,022
ముథోల్	78.76	84.02	2,36,130
బెల్లంపల్లి(ఎస్సీ)	73.85	83.10	1,62,069
చెన్నూరు(ఎస్సీ)	72.73	82.32	1,77,761
ఆదిలాబాద్	63.88	81.64	2,29,249
ఖానాపూర్(ఎస్టీ)	73.77	80.50	2,10,143
నిర్మల్	76.89	79.13	2,37,575
మంచిర్యాల	64.62	73.17	2,50,790
మొత్తం	74.04	82.11	21,43,394



పూజలు చేస్తున్న మహేశ్వర్ రెడ్డి దంపతులు

వరలక్ష్మీ.. వరమివ్వమ్మా..

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మరోవైపు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దీంతో ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. ఇక ఇళ్లలో మహిళలు లక్ష్మీదేవిని ప్రత్యేకంగా పూజించారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంట్లో అష్టలక్ష్మిల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

రోడ్డుపై గిరిజనుల ప్రసవ వేదన

- అంబులెన్స్ వచ్చే సౌకర్యం లేని వైనం..
- గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులకు తరలింపులో నిర్లక్ష్యం
- పురిటి నొప్పులు వచ్చాక కుటుంబ సభ్యుల ఆందోళన
- ఆరు నెలల్లో రోడ్డుపై ప్రసవించిన ఇద్దరు మహిళలు
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు



గురువారం రాత్రి రోడ్డుపై ప్రసవించిన గిరిజన మహిళ

పెంబి: చంద్ర మండలాన్ని సైతం తాకామని సంబురాలు చేసుకుంటున్న తరుణమిది. ఓ వైపు శాస్త్ర సాంకేతిక రంగంలో దేశం దూసుకుపోతున్నా.. మరోవైపు గిరిజనుల జీవితాల్లో మాత్రం చీకట్లు తొలగడం లేదు. మారుమూల పల్లెలకు కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రాక ఆస్పత్రికి సకాలంలో చేరుకోలేని దుస్థితి. ఈ క్రమంలో గర్భిణులు పురిటి నొప్పులతో రోడ్లపైనే ప్రవవిస్తున్నారు. మారుమూల గ్రామాల గర్భిణులను ముందస్తుగానే ఆస్పత్రులకు తరలించాలనే నిబంధన ఉన్నా.. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో పురిటి నొప్పులు వచ్చాక కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోనే ప్రసవిస్తున్నారు. జిల్లాలోని పెంబి మండలంలో ఆరు నెలల్లో ఇద్దరు గర్భిణులు రోడ్డుపై ప్రసవించడం గమనార్హం. వైద్య సేవలు ఎంత మెరుగుపడినా.. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా గిరిజనుల బతుకులు మారలేదు అనడానికి ఈ రెండు ఘటనలే నిదర్శనం.

నాలుగు గంటలు నరకయాతన

పెంబి మండలం తులసిపేట గ్రామానికి చెందిన గర్భిణి గంగమణికి గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు మొదలయ్యాయి. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు పెంబి పీహెచ్‌సీలోని ఐటీడీఏ అంబులెన్స్‌కు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది అంబులెన్స్‌లో డీజిల్ లేదని.. గర్భిణిని ఆస్పత్రికి తీసుకురావాలని ఉచిత సలహా ఇచ్చారు. వెంటనే 108కు సమాచారం అందించారు. వారు కూడా మార్గ మధ్యలో పస్పుల వంతెన కొట్టుకుపోయినందున అక్కడి వరకు గంగమణిని తీసుకురావాలని సూచించారు. దీంతో పురిటి నొప్పులతో తల్లడిల్లుతున్న గంగమణిని ఆటోలో తీసుకుని బయల్దేరారు. కష్టంగా పస్పుల వాగు దాటారు. ఈ సమయంలో నొప్పులు ఎక్కువ కావడంతో రోడ్డుపై నాలుగు గంటలపాటు నరక యాతన పడింది. గర్భిణి బంధువులు అంబులెన్స్‌లో డీజిల్‌కు రూ.500 చెల్లించడంతో రాత్రి 10:30 గంటలకు ఐటీడీఏ అంబులెన్స్‌లో సిబ్బంది గర్భిణి వద్దకు చేరుకుని రోడ్డుపైనే కాన్పు చేశారు. అనంతరం తల్లీబిడ్డను పెంబి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి 108లో ఖానాపూర్ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. తల్లీబిడ్డను పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని వెల్లడించారు.

ఫిబ్రవరిలో వస్‌పల్లి మహిళ..

గత ఫిబ్రవరిలో కూడా మండలంలోని దోందారి గ్రామ పంచాయతీ పరిధిలోని వస్‌పల్లి గ్రామానికి చెందిన గిరిజన మహిళ సీడం సరిత కూడా ఇలాగే రోడ్డుపై ప్రసవించింది. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్ వచ్చే అవకాశం లేదు. రాత్రి 9 గంటల సమయంలో సరితకు పురిటి నొప్పులు మొదలు కావడంతో కుటుంబ సభ్యులు ఐటీడీఏ అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. రోడ్డు లేకపోవడంతో గ్రామానికి రాలేమని.. ఎడ్లబండిలో తీసుకురావాలని సూచించారు. మార్గమధ్యంలోకి అంబులెన్స్ వస్తుందని తెలిపారు. దీంతో నొప్పులతో తల్లడిల్లుతున్న గర్భిణిని ఎడ్ల బండిలో గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామం వరకు తీసుకువచ్చారు. అప్పటికే అర్ధరాత్రి అయింది. పురుటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఆమె వెంట ఉన్న కుటుంబ సభ్యులే అడవిలో కాన్పు చేశారు. తర్వాత ఐటీడీఏ అంబులెన్స్‌లో పెంబి పీహెచ్‌సీకి తరలించారు.

మేల్కోని వైద్యశాఖ..

ఆరు నెలల్లో ఒకే మండలంలో ఇద్దరు మహిళలు రోడ్లపై ప్రసవించినా వైద్యఆరోగ్య శాఖ మేల్కొనడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం కూడా సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెంబి పీహెచ్‌సీలో గిరిజన గ్రామాల కోసం అంబులెన్స్ అందుబాటులో ఉంచినా.. అవసరానికి ఆదుకోని పరిస్థితి. అంబులెన్స్‌లో డీజిల్ లేకుండా ఎందుకు ఉంచుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

తల్లీబిడ్డ క్షేమం

ఖానాపూర్: పెంబి మండలం తులసీపేట్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ రోడ్డుపై ప్రసవించినప్పటికీ తల్లీబిడ్డ క్షేమంగానే ఉన్నారని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతతోపాటు పాపను శుక్రవారం పరామర్శించారు. క్షేమసమాచారాన్ని తెలుసుకున్నారు. డెలివరీకి నెల గడువు ఉన్నప్పటికీ వ్యవసాయ పనులకు వెళ్లడం కారణంగా పురిటి నొప్పులు వచ్చి ముందే ప్రసవించినట్లు పేర్కొన్నారు. గంగమణికి ఇది రెండో కాన్పు అని మొదటి కాన్పు సైతం నార్మల్‌గానే జరిగిందని తెలిపారు.

ఫీ'వర్రీ'





జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఎక్కువగా వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. టైఫాయిడ్, డయేరియా, డెంగీతో చాలా మంది ఆస్పత్రికి వస్తున్నారని వైద్యులు తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన వారికి పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ తర్వాతనే చికిత్స అందిస్తున్నారు. అవసమైన వారికి అడ్మిట్ చేసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

ఇంటి నుంచే ఓటు హక్కు

- వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- ఫాం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఈసారి ఎన్నికల నిర్వహణలో హోం ఓటింగ్‌ను ఎన్నికల నిబంధనల్లో పొందుపర్చడం జరిగిందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకుని స్వీప్ కార్యక్రమంలో భాగంగా సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రానికి రాలేని దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు.. ఇంటి నుంచే ఓటు వేసేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్‌కు 5 రోజులు ముందుగా వెలువరించే నోటిఫికేషన్‌ను అనుసరించి అర్హత ఉన్నవారు 'ఫాం 12డి' ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు పూర్తిస్థాయి ఓటింగ్‌లో పాల్గొనేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లను ఏర్పాటు చేసి వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రాల్లో వృద్ధుకు వీల్‌చైర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. యువత ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సీనియర్ సిటిజన్లపై ఉందన్నారు. ఈనెల 21న ఓటరు ముసాయిదా జాబితా విడుదలయిందని, ప్రతీ బూత్‌లెవల్ అధికారి వారివారి పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాను గోడలపై అంటించి ఉంచారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు సరిచూసుకుని పొరపాట్లు ఉన్నా.. జాబితాలో పేరు లేకపోయినా సెప్టెంబర్ 19లోగా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. 80 ఏళ్ల పైబ డిన వారికి, ఆరోగ్యం సహకరించకపోయినా, వికలాంగులకు, ఎన్నికల వేళ 2, 3 రోజుల ముందుగానే బ్యాలెట్ పేపర్ ఇస్తారని వారికి నచ్చిన వారికి ఓటు వేయవచ్చని తెలిపారు. పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎంసీ లింగన్న, జెడ్పీ సీఈవో సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 31వ రకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా క్యాస్ట్ కేటగిరీ, పరీక్ష రాసే భాష, పట్టణ/గ్రామీణం తప్పుగా నమోదు చేసి ఉంటే సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఆన్‌లైన్‌లో సవరించుకునే అవకాశం విద్యాలయం కల్పించిందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత తెలిపారు. గురువారం జైనథ్ మండలం పిప్పర్‌వాడలో జరిగిన 4వ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీల్లో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థినులు బీ జ్యోతి, సీహెచ్ వసంత రాణించినట్లు పేర్కొన్నారు. శనివారం వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

డిగ్రీ దూరవిద్య పరీక్షలో 40 మంది డిబార్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ దూరవిద్య పరీక్షలో 40 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా పట్టుకుని డిబార్ చేసినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. మొత్తం 242 మంది విద్యార్థులకు గాను 191 మంది పరీక్షకు హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని, మాస్ కాపీయింగ్‌ను సహించబోమని నరేందర్ పేర్కొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన ఆసియాబాను తన నాలుగేళ్ల కూతురు సానియాతో కలిసి శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఉదయం నిద్రలేచి చూసే సరికి వారు కనిపించకుండా పోయారు. చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లేకుండా పోయింది. కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఆమె కూతురుతో కలిసి పుట్టింటి వద్ద ఉంటున్న ఆమె ఇలా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఆసియాబాను తండ్రి షేక్ మహెమూద్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు.

కడెం ప్రాజెక్టులో దూకిన వ్యక్తి

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి దూకినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. ప్రాజెక్ట్ కుడి కాలువ తూము పైనుంచి వ్యక్తి దూకినట్లు, ఈ విషయం సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు తెలిపినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్సై రాజును సంప్రదించగా.. ఈ విషయమై ఎలాంటి ఆధారాలు లేవని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆనంద్‌పూర్‌లో మళ్లీ ఇసుక డంపుల సీజ్

- అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేదెప్పుడో..!
- చోద్యం చూస్తున్న అధికారులు


సీజ్ చేసిన ఇసుక డంపు వద్ద రెవెన్యూ, మైనింగ్ అధికారులు

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా ఇసుక డంపులను సీజ్ చేశారు. శుక్రవారం రెవెన్యూ ఆర్ఐ నితిన్, మైనింగ్ ఆర్ఐ ఆనంద్‌కుమార్ జైనథ్ ఎస్సై పురుషోత్తంతో కలిసి గ్రామంలో దాడులు నిర్వహించారు. గ్రామ శివారులో నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను సీజ్ చేశారు. అయితే అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెల క్రితం కూడా ఇదే గ్రామంలో భారీ ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకడంపుల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణాకు గురైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం రెండోసారి ఇసుక డంపులు సీజ్ చేశామని అధికారులు ప్రకటించినప్పటికీ సీజ్ చేసిన ఇసుకకు ఎలాంటి భద్రత లేకపోవడంతో అక్రమ రవాణాదారులు దాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదే విషయమై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులను వివరణ కోరగా.. ఇసుక డంపులను రక్షించడం తమ బాధ్యత కాదంటే.. తమ బాధ్యత కాదంటూ.. దాటవేసే ధోరణిలో సమాధానమివ్వడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వాస్తవానికి గతంలోనూ ఇదే గ్రామంలో ఇసుక డంపులు సీజ్ చేసినప్పుడు అధికారులు పెద్ద ఎత్తున వేలం నిర్వహించి విక్రయించారు. కానీ.. ఈసారి నామమాత్రంగా దాడులు నిర్వహిస్తూ.. ఇసుక డంపులు సీజ్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజ్ చేసిన ఇసుకకు ఎలాంటి రక్షణ లేకపోవడంతో పలువురు ఈ ఇసుకను అక్రమంగా అమ్ముకుంటున్నారు. అయితే దీనికి కొంతమంది అధికారులూ పరోక్షంగా వీరికి సహకరిస్తున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇసుక తవ్వకాలు చేపట్టే ప్రదేశంలో లారీలు ఇతర వాహనాలు ఇసుక బయటకు తీసే బోట్లు లభించినప్పటికీ వాటిని సీజ్ చేయకుండా అధికారులు చేతులు దులుపుకొంటున్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా పెద్ద ఎత్తున బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అన్ని శాఖల అధికారులు 'మామూలు'గానే తీసుకుంటున్నట్లు సమాచారం. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలను అరికట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

'ఆశ్రమ' విద్యార్థినులకు అస్వస్థత


ఏరియా ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి


విద్యార్థినులను పరామర్శిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఈదుగాం బాలికల ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థినులు శుక్రవారం అస్వస్థత గురయ్యారు. రెండు రోజుల క్రితం ఉపాధ్యాయులు విద్యార్థినులకు బోధకాలు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అవి వేసుకున్నవారిలో 10 మంది శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఉదయం నుంచి వాంతులు, తలనొప్పితో వారు బాధ పడుతూ వార్డెన్‌కు విషయం తెలిపారు. వార్డెన్ వారిని పరిశీలించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది వారి రక్త నమూనాలు సేకరించారు. వైద్యులు పరిశీలించి చికిత్స చేశారు. విద్యార్థినులకు ఇమ్యూనిటీ తక్కువగా ఉండడంతో అస్వస్థత గురయ్యారని తెలిపారు. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి ఆస్పత్రికి వచ్చి విద్యార్థినులను పరామర్శించారు. అస్వస్థతకు గల కారణాలు తెలుసుకుని వారికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. విద్యార్థినులు కోలుకుంటున్నారని.. ఆందోళన అవసరం లేదని, చికిత్స అనంతరం వారిని డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కోరారు. ఆయన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు చిన్ను, రవి తదితరులున్నారు.

క్షమాపణ కోరిన మంత్రి 'తలసాని'

భైంసా: ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబుపై జరిగిన సంఘటనకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ క్షమాపణ కోరారు. ఈమేరకు ఓ వీడియో రిలీజ్ చేశారు. ఆ సంఘటనలో అనుకోని రీతిలోనే అలా జరిగిందని తలసాని వీడియోలో వివరించారు. రాజేశ్‌బాబుపై జరిగిన సంఘటనకు సంబంధించి నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. ఈనేపథ్యంలో సోషల్‌మీడియాలోనూ ఈ సంఘటనకు సంబంధించి పోస్టులు చేశారు. అటు ఉస్మానియాలోనూ నిరసనలు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ దండే విఠల్ తలసానితో మాట్లాడారు. తనకు గిరిజనులపై ఎంతో అభిమానం ఉందని, ఆ కార్యక్రమంలో తన కాలు తొక్కడం, రక్తం కారడం వెనువెంటనే జరిగిందన్నారు. బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసే తాను ఇలాంటి వాటికి దూరంగా ఉంటానన్నారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడానని మరోసారి క్షమాపణ కోరినట్లు వీడియోలో వివరించారు.

గిరిజన మహిళ రోడ్డుపై ప్రసవించడం సిగ్గుచేటు


మహిళను పరామర్శిస్తున్న జానుబాయి

ఖానాపూర్: గిరిజన మహిళ రోడ్డుపై ప్రసవించడం సీఎం కేసీఆర్ పాలనకు సిగ్గుచేటని బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. పెంబి మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన తులసిపేట్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ రోడ్డు సౌకర్యం లేక సుమారు కిలోమీటర్‌కు పైగా కాలినడకన రావడంతో పాటు వంతెన లేని కారణంగా అరకిలోమీటర్ మేర వాగులోని నడుములోతు నీటి నుంచి నడిచి వచ్చిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని పేర్కొన్నారు. దీనంతటికీ బీఆర్ఎస్ పాలన వైఫల్యమే కారణమని ఆరోపించారు. వాగు దాటిన మహిళను తీసుకెళ్లేందుకు 108ను సంప్రదిస్తే డీజిల్ లేదని చెప్పి అంబులెన్స్ రాలేదని తెలిపారు. దీంతో మహిళ రోడ్డుపైనే ప్రసవించాల్సిన దురదృష్ట ఘటన చోటుచేసుకుందన్నారు. సాక్షాత్తు ఐటీడీఏ ఉన్న ఖానాపూర్ నియోజకవర్గంలో గిరిజనుల దుస్థితి ఇలా ఉంటే.. మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. భారతదేశం చందమామపైకి రాకెట్‌ను పంపి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన తరుణంలో తెలంగాణలో మాత్రం ఇలాంటి ఘటన జరగడం శోచనీయమని విమర్శించారు. ఇప్పటికైనా కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాల్సిన రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు.

అంత్యక్రియలకు వచ్చి మృత్యు ఒడికి..

- తాంసిలో విద్యుదాఘాతంతో ఒకరి మృతి
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమని ఆరోపణ


స్వామి (ఫైల్)

తాంసి: అంత్యక్రియలకు వచ్చిన వ్యక్తి అర్ధంతరంగా తనువు చాలించాడు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఎర్రం స్వామి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా సమీప బంధువైన ఇదే మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన స్వామి (50) హాజరయ్యాడు. శ్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహించే క్రమంలో సమీప వాగు నుంచి నీటిని తీసుకువచ్చేందుకు వెళ్తున్న మృతుడి వారసుడికి తోడుగా స్వామి వెళ్లాడు. కాగా, అప్పటికే నీటిలో తెగిపడిన త్రీఫేజ్ విద్యుత్ తీగలను గమనించకుండా అందులోకి దిగిన స్వామి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వామికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, వాగు వైపు ఉన్న విద్యుత్‌తీగలు నీటిలో పడి ఉన్నప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే స్వామి మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు.

సర్వీస్ వైర్ చోరీ

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతుల విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి కోసుకు నిపోయారు. శుక్రవారం మోటార్లు స్టార్ట్ చేయడానికి వెళ్లిన రైతులు సర్వీస్ వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీస్‌స్టేషన్ వెళ్లి ఎస్సై శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమిషాల వ్యవధిలో రెండు ప్రమాదాలు

- ఒకరి పరిస్థితి విషమం

గుడిహత్నూర్: మండలంలో నిమిషాల వ్యవధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి తీవ్రగాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతాపూర్‌కు చెందిన ఆరుగురు మండల కేంద్రంలో జరిగే అంగడికి ఆటోలో బయలుదేరారు. జాతీయ రహదారి 44పై డోంగర్‌గావ్ సమీపానికి రాగానే వేగంగా వస్తున్న కంటెయినర్ లారీ మొదట ఆటో వెనుక ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొని అనంతరం ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి కాలికి, ఆటోలో ప్రయాణిస్తున్న శాంతాపూర్‌కు చెందిన మహబూబ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని వెంటనే అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన కొన్ని నిమిషాల వ్యవధిలో సీతాగోంది వద్ద వాఘాపూర్ యూటర్న్ దగ్గర కంటెయినర్ లారీ అతి వేగంతో అదుపు తప్పి డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాక పోగా కంటెయినర్ లారీ డ్రైవర్ పరారీ అయ్యాడు. దీంతో మొదటి ప్రమాదంలో ఆటోను ఢీకొన్న లారీ ఇదేనేమో.. అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

కప్పర్ల శివారులో ఎలుగుబంటి సంచారం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామశివారులోని పంటచేలలో ఎలుగుబంటి సంచరించింది. కప్పర్ల గ్రామానికి చెందిన యువకులు ఉదయం రన్నింగ్ కోసం జామిడి గ్రామం వైపు ఉన్న రోడ్డుపై వెళ్లారు. వీరికి కప్పర్ల–జామిడి గ్రామాల మధ్య ఉన్న వంతెన సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తూ కనిపించింది. భయాందోళనకు గురైన యువకులు అక్కడి నుంచి గ్రామంలోకి పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన సుంకరి శ్రీకాంత్ (31) బైక్ అదుపుతప్పి మృతి చెందాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. కనుగుట్ట గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఈ నెల 24న ఉదయం 11గంటలకు ఆదిలాబాద్‌కు వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి 8 గంటలకు కనుగుట్ట గ్రామానికి స్నేహితుడు సాయిబాబాతో కలిసి బైక్‌పై వస్తున్నాడు. సాయిబాబాను సొనాల గ్రామంలో వదిలాడు. సొనాల నుంచి రాత్రి 10 గంటలకు కనుగుట్ట గ్రామానికి వెళ్తుండగా కొత్త (బీ) గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పొదల్లోకి వెళ్లి చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ మృతి చెందాడు. శుక్రవారం ఉదయం 10 గంటల అటుగా వెళ్లిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బోథ్‌లోని ప్రధాన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

ఇచ్చోడ: ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న సిరికొండ మండలం సోన్‌పెల్లి గ్రామానికి చెందిన పెందుర్ సాయికుమార్ (17) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలం సోన్‌పెల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ రెండేళ్లుగా ఇచ్చోడలోని విద్యానగర్ కాలనీలో అతడి పెద్దమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాడు. కొద్దిరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోగా ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లోంచి వెళ్లాడు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ముందున్న చర్చి వద్ద పంట పొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని పలువురు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. అతడిని 108 వాహనంలో వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో తండ్రిపై కుమారుడి దాడి

తాంసి: మద్యం మైకంలో తండ్రిపై కుమారుడు కత్తితో దాడిచేసి గాయపర్చిన ఘటన భీంపూర్ మండలం వడూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన రావుల అనిల్ శుక్రవారం తన తండ్రి దేవురావుతో మద్యం మైకంలో గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో అనిల్ ఇంట్లో ఉన్న కత్తితో తండ్రిపై దాడిచేయగా, దేవురావు మెడ, ఇతర చోట్ల గాయాలయ్యాయి. దేవురావును వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల ద్వారా దేశీదారు మద్యం విక్రయిస్తుండడంతో పలువురు దీనికి అలవాటు పడి ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

సుద్ద ముక్కతో కళాఖండాలు


వినాయకుడి ప్రతిమ



సుద్ద ముక్కపై చంద్రయాన్–3 నమూనా


సుద్ద ముక్కపై వినాయకుడి ప్రతిమ చెక్కుతున్న గణేశ్

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ అనుబంధ దర్యాపూర్ గ్రామానికి చెందిన గుండోజీ గణేశ్ సూక్ష్మకళలో ప్రతిభ కనబరుస్తున్నాడు. సుద్ద ముక్కపై చంద్రయాన్–3 రాకెట్ నమూనా చెక్కి దేశభక్తి చాటాడు. దేవతామూర్తుల ప్రతిమలను చెక్కుతూ దైవభక్తి చాటుకుంటున్నాడు. గణేశ్‌ను పలువురు అభినందిస్తున్నారు.

బాసరలో శ్రావణమాస పూజలు


చునరి మనోరత్ పూజల్లో పాల్గొన్న మహిళలు

భైంసా: శ్రావణ శుక్రవారం సందర్భంగా బాసరలో భక్తుల రద్దీ కనిపించింది. వేకువజాము నుంచే బాసరకు వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో చునరి మనోరత్ నిర్వహించారు. ఈ ఉత్సవంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భజన చేస్తూ గోదావరి నది వరకు వెళ్లారు. గోదారమ్మకు పూజలు చేశారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: కొలాం భాష, సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. శుక్రవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో కొలామి వికీపీడియా బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీవో మాట్లాడుతూ.. ప్రస్తుతం కొలామి మాట్లాడుతున్న భాష, సంస్కృతీసంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పూర్వం నుంచి వచ్చిన కొలామి భాషను కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని కోరారు. మౌఖికంగా ఉన్న కొలామి భాషను వికీపీడియాలో లిఖిత పూర్వకంగా నమోదు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. కథలు, పాటలు భద్రపర్చుకోవడానికి బోలి చేతో ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కొలామి భాష పరిశోధనకు మరింత మంది ముందుకు రావాలని, పూర్వం నుంచి నేటి వరకు కొలాం జానపద విజ్ఞానాన్ని నమోదు చేయడానికి, భావితరాలకు కొలాం వికీపీడియా ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఇండిక్ వీకీ ప్రోగ్రాం మేనేజర్ కృపాల్ కశ్యప్, ఉట్నూర్ సాహితీ వేదిక అధ్యక్షుడు జాదవ బంకట్‌లాల్, బోలి చేతో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేతి సాయికిరణ్, సినీ గేయ రచయిత చంద్రమౌళి, కొలాం సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టేకం వసంత్‌రావు, నాయకులు అభిలాష్, సాయినాథ్, రాజ్‌కుమార్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌కు నియోనెటల్ అంబులెన్స్


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు ప్రభుత్వం నియోనెటల్ అంబులెన్స్ మంజూరు చేసింది. ఈ మేరకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అంబులెన్స్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. నవజాత శిశువులు, చిన్న పిల్లలను పీహెచ్‌సీల నుంచి రిమ్స్‌కు తరలించేందుకు, అలాగే ఇక్కడ చికిత్స పొందుతున్న చిన్నారులను అత్యవసర పరిస్థితిలో హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించేందుకు ఈ అంబులెన్స్ దోహదపడుతుందని తెలిపారు. ఇందులో ఆక్సిజన్, రేడియేటర్ వార్మర్, సిరంజి పంప్, ఇన్ఫ్యూజన్ పంప్, తదితర సౌకర్యాలు ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, పిడియాట్రిక్ విభాగం హెచ్ఓడీ హేమలత, అనంత్‌రావు, ఇద్రిస్ అక్బాని తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు అడహక్ పదోన్నతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీల కోర్టు కేసులు ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని అడహక్ పదోన్నతులైనా కల్పించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేవని తెలిపారు. గతంలో విడుదల చేసిన బదిలీలు, పదోన్నతుల జీవోను రద్దు చేసి, నూతన జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక విద్యావ్యవస్థ కుంటుపడుతోందని, ప్రభుత్వం వెంటనే డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్, హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్ రెడ్డి, ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మంత్రి ఐకేరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా మీసేవ కేంద్రాల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా మీ సేవ అసోసియేషన్ తరఫున కొన్నేళ్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు. కాలానుగుణంగా పెరిగిన ధరల దృష్ట్యా అనేక ఆర్థిక, భద్రత పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. మీ సేవ నిర్వాహకుడు, కుటుంబానికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. 2011లో ఉన్న సర్వీసులన్నింటినీ పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుత కమీషన్ పెంచి, స్టేషనరీని ఉచితంగా అందించాలని, ప్రస్తుతం ఉన్న మీ సేవ వార్షిక ఎంఎంసీ పేమెంట్‌ను రద్దు చేయాలని, సెంటర్‌కు ఉచితంగా కరెంట్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, బీమా వర్తింపజేయాలని కోరారు.